ఎన్నికల కాలం ఓటర్లకు గాలం

మండుటెండల్లో ప్రధాన పార్టీల ప్రత్యేక వ్యూహాలు



- క్షేత్రస్థాయి కమిటీల అప్రమత్తం
- వివిధ సంఘాలపై దృష్టి
- ఓటర్లను ప్రభావితం చేసే వారికి ఫోన్ కాల్స్
- శివారు జిల్లాల్లో పోలింగ్ కేంద్రాలు 6,105.
- మొత్తం ఓటర్ల సంఖ్య 66.56 లక్షలు
- వలస ఓటర్లు వేలల్లో ఉంటారని అంచనా

సాక్షి, మేడ్చల్ జిల్లా: ఓటర్లను ఆకర్షించేందుకు ప్రధాన పార్టీలు ప్రత్యేక వ్యూహాలకు పదును పెడుతున్నాయి. మండుటెండల్లో అభ్యర్థులు తమదైన శైలిలో అనుచరులను రంగంలోకి దింపారు. ఎలాగోలా ఓటర్లను బుట్టలో వేసుకునే పని మొదలు పెట్టారు. ఒకవైపు పార్టీ క్షేత్రస్థాయి/బూత్ కమిటీ సభ్యులను అప్రమత్తం చేస్తూనే.. మరోవైపు గంపగుత్త ఓట్ల వేటలో పడ్డారు. పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాలు ఉండగా, కాంగ్రెస్, బీజేపీలు మాత్రం శాసనసభ నియోజకవర్గాల వారీగా ఎన్నికల ప్రచార కమిటీలను నియమించాయి. ఈ నేపథ్యంలోనే కుల, మత, ఉద్యోగ, కాలనీ, కార్మిక, కర్షక, అపార్టుమెంట్లు ఇలా రకరకాల కమిటీలు, సంఘాలపై దృష్టి సారిస్తున్నారు. వారి ప్రత్యేక ఆత్మీయ సమ్మేళనాల్లో పాల్గొని ఓట్ల శాతం పెంపుపై దృష్టి పెడుతున్నారు.

క్షేత్రస్థాయిలో పటిష్టతతో..

బస్తీలు, వార్డులు/డివిజన్లు, గ్రామాల్లో ప్రచారంలోకి వెళ్తున్న ప్రధాన పార్టీల అభ్యర్థులు తాజాగా క్షేత్రస్థాయి /పోలింగ్ బూత్ కమిటీలపై దృష్టి సారిస్తున్నారు. ఏయే పోలింగ్ బూత్‌ల పరిధిలో ఎవరెవరు పని చేస్తున్నారు. వారి సామర్థ్యం ఏమిటి..? వారికి ఎలాంటి వనరులు సమకూర్చాలనే పలు అంశాలపై లోతైన పరిశీలనకు శ్రీకారం చుడుతున్నారు. ఒక్కో నియోజకవర్గంలో ఓటర్ల సంఖ్య ఆధారంగా పోలింగ్ బూత్‌లు ఉండగా, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు క్షేత్రస్థాయి /బూత్ కమిటీల నియామకం పూర్తి చేశాయి. క్షేత్రస్థాయి కమిటీలో 10 నుంచి 15 మంది తగ్గకుండా పార్టీల నాయకులు, కార్యకర్తలను కమిటీల సభ్యులుగా చేర్చారు. వీరు ప్రతిరోజూ తమ పరిధిలోని ఓటర్లను గుర్తించాలి. దగ్గర్లో లేని వారి గురించి ఆరా తీయాలి. పోలింగ్ రోజు ఓటర్లను తీసుకొచ్చే బాధ్యత వీరికే అప్పగించేందుకు కసరత్తు చేస్తున్నారు. నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లోని మల్కాజిగిరి, చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గాల్లో 6,105 పోలింగ్ కేంద్రాల పరిధిలో 66,56,603 మంది ఓటర్లున్నారు. వీరిలో అధిక శాతం ఓట్లు తమ పార్టీకే వేసేలా పార్టీలు నిమగ్నమయ్యాయి. ఇందులో వలస ఓటర్లు వేలల్లో ఉండొచ్చని అంచనా వేస్తున్నారు.

ఎత్తుగడల్లోనూ మార్పు..

ప్రధాన పార్టీలు ఎత్తుకు పైఎత్తులతో నేతలు రాజకీయ ఎత్తుగడలను మారుస్తున్నారు. తాజాగా కుల, మత సంఘాలు, రకరకాల యూనియన్ల వైపు దృష్టి సారిస్తున్నారు. కులాల వారీగా ఉన్న సంఘాలు కొన్ని ప్రాంతాల్లో లక్ష్య సాధన కోసం చురుగ్గా పనిచేస్తున్నాయి. వాటి ప్రభావం ఆయా ప్రాంతాల్లో బలంగా పనిచేస్తుందని కొందరు అభ్యర్థులు విశ్వసిస్తున్నారు.

యూనియన్లపై దృష్టి

పరిశ్రమలు ఇతర రంగాల్లో యూనియన్లూ వందలోనే ఉన్నాయి. పరిశ్రమలు, వివిధ రంగాల కంపెనీలు, ఐటీ రంగాల్లో పనిచేస్తున్న వలస ఓటర్లు శివారు జిల్లాల్లో వేలల్లో ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వ, ప్రైవేటు, ఉద్యోగ అసోసియేషన్లు, సంఘాలతో ప్రధాన పార్టీల నేతలతో పాటు అభ్యర్థులు ప్రత్యేక సమావేశాలు నిర్వహించేందుకు ప్రత్యేక కార్యాచరణతో ముందడుగు వేస్తున్నారు.

శివారు జిల్లాల్లోని పార్లమెంట్ నియోజకవర్గాల్లో పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల వివరాలు..

లోక్‌సభ నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	ఓటర్ల సంఖ్య
మల్కాజిగిరి	3,228	37,28,417
చేవెళ్ల	2,877	29,28,186
మొత్తం	6,105	66,56,603

ప్రభావితం చేసే వ్యక్తులకు ఫోన్లు

పార్లమెంట్ ఎన్నికల్లో క్షేత్రస్థాయిలో కమిటీలపైనే అభ్యర్థులు ఎక్కువ భారం వేస్తున్నట్లు తెలుస్తోంది. ఇంటింటికీ వెళ్తున్న కమిటీల నుంచి రోజూ వారి నివేదికలను ప్రధాన పార్టీలతో సహా అభ్యర్థులు తెప్పించుకుంటున్నారు. ఏ రోజుకారోజు ఓటర్ల మనోగతం, ఆయా ప్రాంతాలు, బస్తీలు, పట్టణాల స్థానిక పరిస్థితులను సమీక్షిస్తున్నారు. అవసరమైతే కలిసిన ఓటర్ల ఫోన్ నంబర్లనూ సేకరిస్తున్నారు. వీలైతే అభ్యర్థితోనూ మాట్లాడిస్తున్నారు. కొందరు అభ్యర్థులు మెజార్టీ లక్ష్యంగా ఓటర్లను ప్రభావితం చేసే వ్యక్తులతో ఫోన్లల్లో మాట్లాడిస్తూ.. ఎన్నికల ప్రచారాన్ని కొత్త పుంతలు తొక్కిస్తున్నారు.

వందల్లో పరిశ్రమలు..

శివారు జిల్లాల్లోని మల్కాజిగిరి, చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో ఉప్పల్, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, మల్కాజిగిరి, మేడ్చల్, రాజేంద్రనగర్, ఎల్బీనగర్, హయత్‌నగర్, మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, షాద్‌నగర్, జీడిమెట్ల, బాలానగర్, కూకట్‌పల్లి, ఉప్పల్ తదితర అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని నాచారం, మల్లాపూర్, కుషాయిగూడ, చర్లపల్లి, మౌలాలి, శామీర్‌పేట్, మేడ్చల్ ప్రాంతాల్లో ప్రభుత్వ రంగ పరిశ్రమలతో పాటు ఇంజినీరింగ్, ఫార్మా, ఫుడ్ ఇండస్ట్రీలు ఉన్నాయి. మౌలాలి ప్రాంతంలో ఫ్యాబ్రికేషన్, స్టీల్, ప్లాస్టిక్ ఫర్నీచర్, కెమికల్, ఎలక్ట్రానిక్స్ తరహా పరిశ్రమలు ఉన్నాయి. కోకాకోలా కంపెనీల్లో కూడా కార్మికులు, ఉద్యోగులు జీవనోపాధి పొందుతున్నారు. బాలానగర్ పారిశ్రామికవాడ పరిధిలో ఫ్యాన్లు తయారు చేసే కంపెనీలు, ఆటోమొబైల్ వస్తువుల తయారీ, బీర్ మాన్యు ఫాక్చరింగ్ యూనిట్, ఫాబ్రికేషన్, వైర్ మెష్ యూనిట్లు, ఫుడ్ ప్రాడక్ట్స్, ఫార్మా యూనిట్లు తదితర కంపెనీలు ఉన్నాయి. బీహెచ్‌ఈఎల్, ఆర్‌అండ్‌డీ, హెచ్‌ఏఎల్, ఐడీపీఎల్ (ప్రస్తుతం ఖాయిలా పడిన పరిశ్రమ) ఎన్‌ఆర్‌ఎస్‌ఏ వంటి కంపెనీలు ఉన్నాయి. ఐడీఏ బాలానగర్, ఐడీఏ కూకట్‌పల్లి, సీఐఈ గాంధీనగర్ ఒకే చోట ఉన్నాయి. శామీర్‌పేట్, మేడ్చల్ మండలాల్లో బయోటెక్, కెమికల్, విత్తన చిన్నతరహా పరిశ్రమలు ఉన్నాయి. గుండ్లపోచంపల్లిలో అపరెల్ టెక్స్‌టైల్ పార్కు ఉంది. తుర్కపల్లిలో ఐసీఐసీఐ నాలేడ్జ్ కంపెనీ పేరుతో పరిశ్రమల హబ్ ఏర్పడ్డాయి. ఘట్‌కేసర్, కీసరలో కూడా చిన్న కంపెనీలు, వందలాది పరిశ్రమలు ఉన్నాయి. శివారు రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో ఐటీ రంగం విస్తరిస్తోంది. వీటిల్లో కూడా వందలాదిగా పని చేస్తున్నారు. వీరంతా ఇక్కడే జీవనాన్ని సాగిస్తుండగా, చాలామంది ఓటు హక్కును కూడా కలిగి ఉన్నారు. వీరి ఓట్లపై కూడా ప్రధాన పార్టీల అభ్యర్థుల గెలుపు ఓటములు ఆధారపడి ఉన్నట్లు చర్చ సాగుతోంది.

సునీతమహేందర్‌రెడ్డిని గెలిపించాలని ప్రచారం



ఘట్‌కేసర్‌లో ప్రచారం చేస్తున్న చైర్ పర్సన్ పావనీజంగయ్య, ముత్యాలు, రాధాకృష్ణ

ఘట్‌కేసర్: మల్కాజ్‌గిరి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సునీతమహేందర్‌రెడ్డిని గెలిపించాలని కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షప్రధాన కార్యదర్శి ముత్యాలుయాదవ్, రాధాకృష్ణముదిరాజ్, వర్కింగ్ ప్రెసిడెంట్ మశ్చేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మున్సిపాలిటీలోని పదో వార్డులో శుక్రవారం ప్రచారం చేశారు. ముఖ్యఅతిథిగా చైర్‌పర్సన్ పావనీ జంగయ్య, స్థానిక కౌన్సిలర్ శశికళతో కలిసి కాంగ్రెస్ ప్రభుత్వం 120 రోజుల్లో అమలు చేసిన గ్యారంటీలను ప్రజలకు వివరించారు. చేయి గుర్తుకు ఓటేయాలని కోరారు. కార్యక్రమంలో రవీందర్, అనిత, ఆంజనేయులు యాదవ్, నాగరాజుముదిరాజ్, దేవేందర్‌ముదిరాజ్, కె.ఆంజనేయులు, శశిధరన్, ఫరూక్, సంజీవరెడ్డి, నాగభూషణం పాల్గొన్నారు.

క్రీమ్‌స్టోన్ ఐస్ క్రీమ్ సెంటర్ ప్రారంభం



క్రీమ్ స్టోన్ ఐస్ క్రీమ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న అమిత్ రెడ్డి, డీఎస్ఎల్ మాల్ ప్రతినిధులు

ఉప్పల్: ఉప్పల్ డీఎస్ఎల్ వర్చు మాల్‌లో శుక్రవారం క్రీమ్ స్టోన్ ఐస్ క్రీమ్ షాపు ప్రారంభమైంది. సుమారు 40 కి పైగా భిన్న రుచులు ఉండే విధంగా ఈ స్టోర్‌ను లాంచ్ చేసారు. ఉప్పల్, పరిసర ప్రాంత వాసులకు అందుబాటులో ఉండే విధంగా ఉప్పల్ డీఎస్ఎల్ మాల్‌లో ఈ స్టోర్‌ను ప్రారంభించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో అమేజ్‌టెర్రా కంపెనీ యాజమానులు ఎస్.అమిత్‌రెడ్డి, ఎ. రాజశేఖర్ రెడ్డి, క్రీమ్ స్టోన్ మేనేజర్ రాజు, డీఎస్ఎల్ మాల్ మేనేజర్లు రవీందర్ రెడ్డి, మదన్ పాల్గొన్నారు.

ఎల్ఐజీలో పందులు, కుక్కల బెడద



పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని ఎల్ఐజీ కాలనీలో కుక్కలు, పందుల బెడదతో ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. ఇటీవల కాలనీలో ఏర్పాటు చేసిన చెత్త డబ్బాలతో కుక్కలు, పందుల సంఖ్య పెరిగినట్లు కాలనీవాసులు చెబుతున్నారు. చీకటి పడిదంటే కుక్కలు పిల్లలపై దాడి చేస్తున్నాయని వాపోతున్నారు. పిల్లలు రోడ్డుపైకి రావాలంటేనే భయపడిపోతున్నారు. గతంలో చెత్తను కాలనీవాసులు నేరుగా ట్రాక్టర్‌లో వేసేవారు. అక్కడ నుంచి డంపింగ్ యార్డుకు తీసుకెళ్లేవారు. ప్రస్తుతం చెత్త డబ్బాలు ఏర్పాటు చేయడంతో కుక్కలు, పందులు ఆహార వ్యర్థాల కోసం డబ్బాల వద్దే గుంపులుగా ఉంటూ రోడ్లపై విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. మహిళలు, పిల్లలపై ఎప్పుడు ఏ కుక్క దాడి చేస్తుందోనని కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. కుక్కలు, పందుల బెడదను నివారించేందుకు మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సొంత గూటికి మోహన్ రెడ్డి



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో పార్టీలో చేరుతున్న మోహన్‌రెడ్డి

ఉప్పల్: ఉప్పల్ బీఆర్ఎస్ నేత ఎలుగేటి మోహన్ రెడ్డి తిరిగి సొంత గూటికి చేరుకున్నారు. శుక్రవారం మాజీ మంత్రి పట్నం మహేందర్ రెడ్డి నేతృత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఆయనకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో లోకేందర్ రెడ్డి, బండారి వెంకటరెడ్డి, రమాకర్‌రెడ్డిలు కూడా పార్టీలో చేరినట్లు తెలిపారు.

ముగిసిన ప్రతిష్ఠాపన మహోత్సవం

మల్కాజిగిరి: ఎస్పీనగర్‌లోని శిరిడీసాయిబాబా మందిరంలో కుర్తాళం సిద్దేశ్వరీ పీఠం ఆధ్వర్యంలో మూడు రోజులుగా జరుగుతున్న వారాహి, ప్రత్యంగిరా, నాగదేవత, నవగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవము ఘనంగా ముగిసింది. చివరి రోజు విగ్రహ ప్రతిష్ఠాపన, మహాపూర్ణాహుతి, మహా కుంభాభిషేకము, వసంతోత్సవము, భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిగింది. ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్లు శ్రవణ్, మురుగేష్, మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్ తదితరులు అమ్మవార్లను దర్శనం చేసుకున్నారు.

ఉత్సాహంగా కళాశాల వార్షికోత్సవం

ఉప్పల్: ఉప్పల్ లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కళాశాల వార్షికోత్సవం శుక్రవారం విద్యార్థులు, లెక్చరర్ల కోలాహలం మధ్య వేడుకగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సెయింట్స్ జోసఫ్ మాజీ ప్రిన్సిపల్ డాక్టర్ వికే స్వామి హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రమశిక్షణకు మారుపేరు ఉప్పల్ లిటిల్ ఫ్లవర్ విద్యా సంస్థలని కొనియాడారు. వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన పలు క్రీడా పోటీల్లో గెలు పొందిన విద్యార్థులకు ప్రిన్సిపల్ జయంతితో కలిసి బహుమతులు ప్రదానం చేసారు. కరస్పాండెంట్ అరుణ్ ప్రకాష్‌లు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యకర్తల రక్తదానం

మల్లాపూర్: నాచారానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త మమత అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. ఆమెకు రక్తం అవసరం కాగా విషయం తెలుసుకున్న నాచారం డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు బండారం శ్రీకాంత్‌గౌడ్ స్పందించి కాంగ్రెస్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. వెంటనే స్పందించిన పలువురు కాంగ్రెస్ నాయకులు నరేష్, జాఫర్‌లు రక్తదానం చేశారు.

విదేశీవిద్య 'స్కాలర్‌షిప్స్'కు సహకారం

సాక్షి, సిటీబ్యూరో: విదేశాల్లో విద్యాభ్యాసం చేయాలనుకునే విద్యార్థులకు స్కాలర్‌షిప్ సహిత ప్రవేశాలను అందించడంలో సహకారం అందించనున్నట్లు నగరానికి చెందిన జూనియర్ కళాశాల టెక్సాస్ ఇంటర్నేషనల్ అకాడమీ ప్రతినిధులు తెలిపారు. అమెరికాలో బీటెక్ చేయాలనుకునే 11వ, 12వ తరగతి విద్యార్థులకు పాఠ్యాంశాలతో ప్రారంభించి ఐఈఎల్ టీఎస్/టోఫెల్ తయారీ, అగ్రశ్రేణి విశ్వవిద్యాలయాల్లో ప్రవేశాలకు అప్లికేషన్ వరకూ మద్దతు అందిస్తామని, వీసా సహాయం, మెరిట్ లేదా అవసరాల ఆధారితంగా ప్రభుత్వ లేదా ప్రభుత్వేతర స్కాలర్‌షిప్‌లు అందుకోవటంలో సహాయ సహకారాలు అందిస్తామన్నారు. యూఎస్ఏకు అధ్యయన పర్యటనలకు కూడా సహాయ పడతామని వివరించారు.

విద్యార్థి అదృశ్యం



వైభవ్ హనుమాన్ (ఫైల్)

జవహర్‌నగర్: విద్యార్థి అదృశ్యమైన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జవహర్‌నగర్ కార్పొరేషన్ సీఆర్‌పీఎఫ్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేసే హనుమాన్ టేకలే, భార్యా పిల్లలతో కలిసి ఉంటున్నాడు. పెద్ద కుమారుడు వైభవ్ హనుమాన్(16) బొల్లారంలోని కేంద్రీయ విద్యాలయంలో 10వ తరగతి చదువుతున్నాడు. ఈ నెల 25వ తేదీన వైభవ్ ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. అతడి ఆచూకీ కోసం తెలిసిన చోట్ల వెతికినా లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు

అల్వాల్: కానాజిగూడలోని మరకత శ్రీలక్ష్మీ గణపతి దేవస్థానం అష్టమ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం సుప్రభాత సేవ, విశేష అభిషేకం, అంకురార్పణ, అగ్నిప్రతిష్ఠాపన, సామూహిక కుంకుమార్చనలు జరిగాయి. శనివారం సంకటహర చతుర్థి సందర్భంగా విశేష పూజలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు, ఆలయ నిర్వాహకులు మోత్కూరు సత్యనారాయణశాస్త్రి, శ్రీయ, సిద్దు, వెంకటరావు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం



విగ్రహ ప్రతిష్ఠలో ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, పండితులు, భక్తులు

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని ఏడో వార్డులో నూతనంగా నిర్మించిన వెంకట మరకత చంద్రమౌళీశ్వర హనుమాన్ దేవస్థానంలో పలుదేవతా మూర్తుల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాల్లో ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం పండితులు స్వామివారి ఆశీర్వచనాలు అందజేశారు. కాలనీవాసులు ముందుకొచ్చి సుమారు కోటిన్నర రూపాయలతో దేవాలయాన్ని నిర్మించుకోవడం అభినందనీయమన్నారు. కాంగ్రెస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు. మూడోరోజు పూజా కార్యక్రమాలను వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. హంపి విరూపాక్ష విద్యారణ్య భారతి స్వామివారు, పుష్పగిరి శారధా లక్ష్మీనృసింహ భారతీస్వామి చేతుల మీదుగా శివకార్తీక్‌శాస్త్రి, శ్రీసాయిబాలాజీశర్మ ఆధ్వర్యంలో వైదిక నిర్వహణ, యంత్ర, ప్రాణప్రతిష్ఠ నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పూజల్లో ఆలయ చైర్మన్ గూడూరు ఆంజనేయులుగౌడ్, ఉపాధ్యక్షుడు కౌకుట్ల అనంతరెడ్డి, కౌన్సిలర్లు గూడరు సబిత, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

కేఏబీఐఎల్, ఎన్‌జీఆర్‌ల మధ్య కీలక ఒప్పందం

ఉప్పల్: భారతదేశం ఖనిజ అన్వేషణ సామర్థ్యాలను పెంపొందించే లక్ష్యంగా శుక్రవారం కేఏబీఐఎల్, ఎన్‌జీఆర్‌ల మధ్య కీలక ఒప్పందం కుదిరింది. నాల్కో డైరెక్టర్ కేఏబీఐఎల్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి సదాశివ సమంతరాయ్, సీఎస్ఐఆర్– ఎన్‌జీఆర్ఐ డైరెక్టర్ డా.ప్రకాశ్ కుమార్ ఈ కార్యక్రమానికి ప్రాతినిధ్యం వహించారు. ఈ ఒప్పందం భువనేశ్వర్‌లోని నాల్కో కార్పొరేట్ కార్యాలయంలో జరిగినట్లు ఎన్‌జీఆర్ఐ శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది.

సందర్శకులను ఆకట్టుకుంటున్న ఎగ్జిబిషన్

బోడుప్పల్: పీర్జాదిగూడ నగర పాలక సంస్థ పరిధిలోని ఉప్పల్ డిపో వద్ద ఏర్పాటు చేసిన కేఆర్‌సి ఎగ్జిబిషన్ సందర్శకులను ఆకట్టుకుంటోంది. ప్రతి రోజు సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు సందర్శకులతో కిట కిటలాడుతుంది. ఈ ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన తాజ్‌మహల్, ఎర్రకోట సందర్శకులను ప్రత్యేక ఆకర్షణగా నిలిస్తోంది.

సీపీఐ నేత బండాల సత్యనారాయణ మృతి



అల్వాల్: సీపీఐ సీనియర్ నాయకులు, ఆర్టీసీ మాజీ ఉద్యోగి బండాల సత్యనారాయణ (70) అనారోగ్యంతో శుక్రవారం యాప్రాల్‌లోని ఆయన నివాసంలో మృతిచెందారు. విషయం తెలుసుకున్న సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు సీహెచ్ దశరథ్, రొయ్యల కృష్ణమూర్తి, తోటపల్లి శంకర్, అల్వాల్ మండల కార్యదర్శి సహదేవ్, సహాయ కార్యదర్శి చంద్రయ్య, మల్కాజిగిరి మండల కార్యదర్శి యాదయ్యగౌడ్‌లు ఆయన నివాసానికి చేరుకొని నివాళులర్పించారు. బండాల సత్యనారాయణ పార్టీ కోసం, కార్మికుల సంక్షేమానికి అహర్నిశలు పనిచేశారన్నారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటన్నారు.

రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించుకుంటాం



నాగారంలో ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ నేతలు

కీసర: మల్కాజ్‌గిరిలో బీఆర్ఎస్ నుంచి ఎంపీ అభ్యర్థిగా బరిలో ఉన్న రాగిడి లక్ష్మారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని బీఆర్ఎస్ నాగారం పట్టణ అధ్యక్షుడు తేళ్ల శ్రీధర్, వర్కింగ్ ప్రెసిడెంట్ నిమ్మల శ్రీనివాస్ అన్నారు. నాగారం మున్సిపాలిటీలో శుక్రవారం నిర్వహించిన బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు విఫలమయ్యాయన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించాలని కోరారు. సమావేశంలో కౌన్సిలరు కౌకుట్ల మమతాకృష్ణారెడ్డి, అన్నంరాజు లావణ్యశ్రీనివాస్, కౌకుట్ల అనంతరెడ్డి, గూడురు సబితాంజనేయులుగౌడ్, కొమిరెల్లి అనితాసుధాకర్, మోకు జగన్మోహన్‌రెడ్డి, దివ్యదయాకర్‌రావు, బదనపురం శ్రీనివాస్, కో ఆప్షన్ సభ్యులు అశోక్, రఫియా, జాలాల్‌పాషా, మాజీ వార్డు సభ్యులు చిన్నంరాజు సాయినాథ్‌గౌడ్, భాగ్యలక్ష్మీ, నాగేందర్, అర్చన, సంజీవ, కార్యదర్శి మచ్చ శ్రీనివాస్, గండి అంజయ్యగౌడ్, వరకాల పెంటయ్య, పైళ్ల మల్లారెడ్డి, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

జవహర్‌నగర్‌లో బీఆర్ఎస్ ప్రచారం

జవహర్‌నగర్: మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించాలని శుక్రవారం జవహర్‌నగర్‌లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు.



జవహర్‌నగర్‌లో రాగిడిని గెలిపించాలని ఉద్యమకారుడు సుధాకర్‌చారి ప్రచారం



21వ డివిజన్ బీఆర్ఎస్ ఇన్‌చార్జీ ప్రకాష్ ఆధ్వర్యంలో ప్రచారం

దేశాభివృద్ధి ప్రధాని మోదీతోనే సాధ్యం

- బీజేపీ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్
- జవహర్‌నగర్‌లో బీజేపీ నాయకుల భారీ ర్యాలీ



జవహర్‌నగర్‌లో మాట్లాడుతున్న బీజేపీ మల్కాజిగిరి అభ్యర్థి ఈటల రాజేందర్



ఘట్‌కేసర్‌లో ప్రచారం చేస్తున్న హనుమాన్, నాయకులు



బోగారంలో బీజేపీ ఎన్నికల ప్రచారం

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని ఫైరింగ్ కట్టా నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్వహించిన భారీ ర్యాలీకి బీజేపీ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం కుమ్ములాటలకే సరిపోయిందని, రాష్ట్ర అభివృద్ధిపై పట్టింపే లేదన్నారు. ఆడబిడ్డల పెళ్లిళ్లకు తులం బంగారం పెళ్లిలోనే ఇస్తామని, మహిళలకు మహాలక్ష్మీ పథకంతో ఆర్థికంగా సాయం చేస్తామని అబద్ధపు మాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ పూర్తిగా విఫలమైందన్నారు. దేశ అభివృద్ధి ప్రధాని మోదీతోనే సాధ్యమని, కమలం గుర్తుకు ఓటు వేసి తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఏనుగు సుదర్శన్‌రెడ్డి, విక్రంరెడ్డి, చంద్రశేఖర్‌యాదవ్, జవహర్‌నగర్ అధ్యక్షుడు కమల్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థిని గెలిపించాలి

ఘట్‌కేసర్: మల్కాజ్‌గిరి ఎంపీగా బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను గెలిపించాలని ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో ఆ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు విప్పర్ల హనుమాన్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రచారం చేశారు. ఇంటింటికీ తిరిగి దేశానికి బీజేపీ విజయాలను వివరించారు. మోదీ పాలనలో దేశం ప్రశాంతంగా ఉందని, కమలం గుర్తుకు ఓటేయాలని ఓటర్లను అభ్యర్థించారు. ప్రశాంత్‌రెడ్డి, సుభాషిణి, మహిళా మోర్చా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈటల గెలుపు ఖాయం

కీసర: మేడ్చల్–మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు ఓట్లు వేసి గెలిపించాలని బీజేపీ కీసర మండల అధ్యక్షుడు దేశం మల్లేష్‌గౌడ్ అన్నారు. భోగారం, కరీంగూడ, తదితర గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 9 ఏళ్ల కాలంలో దేశంలో నరేంద్ర మోదీ ప్రధానిగా బీజేపీ ప్రభుత్వం పేదల కోసం అనేక పథకాలను అమలు చేసిందన్నారు. దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడంతో పాటు ప్రపంచ దేశాల్లో దేశానికి ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చారన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు ప్రజలను మోసం చేశాయని, ఈ ఎన్నికల్లో రెండు పార్టీలకు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి, కొలిచెలిమి కృష్ణ, నల్ల వెంకట్‌రెడ్డి, చనింగని సుధాకర్, కోల బాల్‌రాజ్‌యాదవ్, వంగేటి బాపిరెడ్డి, రాగుల అశోక్, మెట్టు కృష్ణాయాదవ్, ఐలయ్యయాదవ్, బండారి శ్రీనివాస్‌రెడ్డి, అన్నోజిగూడ మల్లారెడ్డి, రవీందర్, సత్యనారాయణ, ఆంజనేయులు, మహేందర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.